నేటి నుంచి మోగనున్న బడి గంట

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 11 : నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. నిన్న మొన్నటి వరకు ఆడుతూ పాడుతూ గడిపిన పిల్లలు నేటి నుంచి భుజాన బ్యాగేసుకొని ఉదయాన్నే టాటా.. బైబై అంటూ బడికి పోయే సమయం రానే వచ్చింది. ఏప్రిల్ 23 నుంచి జూన్ 11 వరకు అంటే 49 రోజులుగా సెలవులతో గడిపిన పిల్లలకు నేటి నుంచి బడి గంటలు మోగనున్నాయి. ఎల్‌కేజీ చదువులకే వేల కొద్ది సమర్పించుకోవాల్సి వస్తుంది. పుస్తకాలు, బ్యాగులు, పెన్నులు, పెన్సిళ్లు, యూనిఫామ్స్ తదితర వస్తువులు మావోడు బాగా చదువుకోవాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు పిల్లలు అడుగకముందే కొనేస్తున్నారు. ఒకప్పుడు చదువు అంతంతగా వచ్చిన వారసత్వంగా వచ్చే వృత్తిని, వ్యాపారాలనే నమ్ముకుని పిల్లలను అదే దారిలోకి తెచ్చేవారు. కానీ ఇప్పుడు అలా కాదు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల నిమిత్తం పిల్లల్ని మంచిగా చదివించడం.. మంచిగా ర్యాంకులు రాబట్టడం కోసం తల్లిదండ్రులు విశేషంగా కృషి చేస్తున్నారు. జూన్ నెల ప్రారంభం కాగానే పేద కుటుంబాల గుండెల్లో గుబులు మొదలయ్యేది. ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించడమే కాకుండా విద్యార్థులకు సన్న బియ్యంతో మధ్యాహ్న భోజన పథకం, దుస్తులు, పుస్తకాలు, ఉపకార వేతనాలు అందిస్తున్నారు. అంతే గాకుండా గతేడాది నుంచి పాఠ్యపుస్తకాలతో పాటు నోట్‌బుక్స్ సైతం ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుంది. బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశాలు జారీ చేయడంతో ఉపాధ్యాయులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ర్యాంకులు సాధించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆశిస్తుంది పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం వేల కోట్లు వెచ్చిస్తుంది.

ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులైన ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులైన ఉపాధ్యాయులు బోధిస్తుంటారు. ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో తమ తమ పిల్లలను చేర్పించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయండంటూ ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలది పోటాపోటీ ప్రచారం మాత్రమే. ప్రైవేట్ పాఠశాలల్లో అర్హులైన ఉపాధ్యాయులు బోధిస్తున్నరా అనే విషయం కూడా తల్లిదండ్రులు ఆలోచించాల్సిన అవసరమున్నది.

మెదక్‌లోని ప్రభుత్వ పాఠశాల

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

చండూర్‌లో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు

కొల్చారం : అంసానిపల్లిలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈవో రాధాకిషన్

చిలిపిచెడ్, జూన్ 11 : గ్రామాల్లో బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని, ప్రతి గ్రామంలో బడిబాట కార్యక్రమం ఉపాధ్యాయులు విజయవతం చేయాలని చండూర్ పాఠశాల కాంప్లెక్స్ హెచ్ఎం హరిసింగ్, ఎంపీడీవో ఆనంద్ అన్నారు. మండల కేంద్రమైన చిలిపిచెడ్, చండూర్, చిట్కుల్, అజ్జమర్రి, సోమక్కపేట, ఫైజాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలోని ఉపాధ్యాయులు, గ్రామ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు గ్రామంలో రాత్రి పల్లెనిద్ర చేసి ఉదయం గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు.

బడిబాటలో పాల్గొన్న డీఆర్డీవో

నర్సాపూర్, జూన్ 11 : మండల పరిధిలోని ఎల్లారెడ్డిగూడ తండా గ్రామపంచాయతీ పరిధిలోని జయరాంతాండలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. సోమవారం రాత్రి పల్లెనిద్రలో భాగంగా జయరాంతాండలో రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లిబడీడు పిల్లలను బడిలో చేర్పించాలని అవగాహన కల్పించారు.

రామాయంపేటలో..

రామాయంపేట, జూన్ 11 : రామాయంపేట మండలం అక్కన్నపేట, కాట్రియాల గ్రామాల్లో బడిబాట కార్యక్రమం జోరందుకుంది. అక్కన్నపేటలో తహసీల్దార్ రజినీకుమారి, కాట్రియాలలో మండల వ్యవసాయ శాఖ అధికారి రాజ్‌నారాయణ పాల్గొని ఇంటింటికీ తిరుగుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ప్రచారం చేశారు. బడిబాటలో ఆయా గ్రామాల్లో పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పాపన్నపేట్‌లో..

పాపన్నపేట్, జూన్ 11 : సమస్యల పరిష్కరానికి పల్లె నిద్ర అని మండల తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని మక్తా భూపతిపూర్‌లో సోమవారంరాత్రి పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ గ్రామంలో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న విద్య వసతుల గురించి పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్ ఉచితంగా ఇవ్వనున్నట్లు వారికి తెలియజేయాలన్నారు. బడికి దూరంగా ఉన్న విద్యార్థుల ఇంటికి వెళ్లి బడిలో చేర్పించే విధంగా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు సకాలంలోపూర్తి చేయాలన్నారు. ఉపాధ్యాయులు, నవీన్, సల్మాన్‌రాజ్, ఘట్టయ్య, జూనియర్ అసిస్టెంట్ కిషోర్ పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ ఉన్నారు.

ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి

కొల్చారం, జూన్ 11 : బడిబాట కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం మండల పరిధిలోని పోతంశెట్‌పల్లి, అంసానిపల్లి గ్రామాల్లో జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించడమే బడిబాట కార్యక్రమ లక్ష్యమన్నారు. ఎంఎన్‌వో సత్యనారాయణ రావు, ప్రధానోపాధ్యాయులు మధుకర్ రావు, ఎల్లేశం, ఉపాధ్యాయులు సంగయ్య, శ్రీనివాస్, పోచయ్య, తులసి, కమల, జ్యోత్స్న, పంచాయతీ కార్యదర్శి అరుంధతి పాల్గొన్నారు.

మెదక్‌లో..

మెదక్‌రూరల్, జూన్ 11 : మండల పరిధిలోని పాతూరులో స్పెషల్ అధికారి సల్మాన్, ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. గ్రామంలో బడికి దూరంగా ఉన్న విద్యార్థుల ఇంటికి వెళ్లి బడిలో చేర్పించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

బ్రాహ్మణపల్లిలో..

నర్సాపూర్, జూన్ 11 : మండల పరిధిలోని బ్రాహ్మణపల్లిలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ బడీడు పిల్లలను తప్పకుండా బడికి పంపించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్వేత, సీఆర్పీ రాధాగోపాల్, ఉపాధ్యాయులు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడిబాట..

వెల్దుర్తి, జూన్ 11: ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా గ్రామ గ్రామాన నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండలంలోని మన్నెవారి జలాల్‌పూర్ గ్రామంలో నిర్వహించిన బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఇన్‌చార్జి ఎంపీడీవో విఘ్నేశ్వర్ తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన, నాణ్యమైన విద్య అందుతుందని, ప్రభుత్వ అన్ని వసతులు, సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి ఆర్థిక ఇబ్బందులకు గురికావద్దని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలి

అల్లాదుర్గం, జూన్ 11: చిన్నారులకు క్రమ శిక్షణతో కూడిన మంచి విద్య అందించాలంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంపీడీవో శంకర్ ఊపస సూచించారు. మంగళవారం అల్లాదుర్గం,ముస్లాపూర్ గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. బడి బయట ఉన్న విద్యార్థులను గుర్తించి వారిని బడిలో చేర్పించేలా తల్లిదండ్రులకు తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్, హెచ్ఎంలు ధనుంజయ, రవికుమార్, ఏపీఎం నాగరాజు పాల్గొన్నారు.

చేగుంటలో..

చేగుంట, జూన్ 11 : బడీడు పిల్లందరిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఐసీడీఎస్ జిల్లా అధికారి బ్రహ్మాజీ, చేగుంట తహసీల్దార్ గియానిస్సాబేగం, ఎంపీడీవో చిన్నారెడ్డి పేర్కొన్నారు. చేగుంట మండల పరిధిలోని వడియారం,కర్నాల్‌పల్లి చేగుంట,వల్భాపూర్ తదితర గ్రామాల్లో బడి బాటలో భాగంగా ర్యాలీలు నిర్వహించారు. చేగుంట మండల నోడల్ అధికారి నీరజ, ఈవో నాగభూషణం గౌడ్, పంచాయతీ కార్యదర్శి విజయపాల్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎంలు, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్ సిద్ధమ్మ, మాధవి, ఎంపీటీసీ బక్కి లక్ష్మీరమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేటలో..

నిజాంపేట, జూన్ 11 : మండల వ్యాప్తంగా అధికారులు, ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలంటూ ప్రధాన వీధుల వెంబడి పర్యటించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది, అధికారులు ఉన్నారు.

నర్సాపూర్ : జయరాంతండాలో బడిబాటలో పాల్గొన్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు

పిడుగుపాటుకు మహిళ మృతి

చిలిపిచెడ్, జూన్ 11: పిడుగుపడి మహిళ మృతి చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం చిలిపిచెడ్ మండలంలోని సోమక్కపేట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు,కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమక్కపేట గ్రామ పంచాయతీ పరిధిలో గంగిరెద్దుల గూడానికి చెందిన బత్తుల ఎల్లమ్మ (40) పిల్లలతో కలిసి జోగిపేటకు వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం, పిడుగుపడి ఎల్లమ్మ అక్కడికక్కడే మృతి చెందింది.

పిడుగుపాటుకు కాడెద్దు..

చేర్యాల, జూన్ 11 : పిడుగుపాటుకు కాడెద్దు మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని తాడూరులో జరిగింది. గ్రామానికి చెందిన వడ్లకొండ రంగయ్య గౌడ్ తనకున్న రెండు కాడెద్దులతో వ్యవసాయం సాగుచేసుకుంటున్నాడు. రోజువారీగా వ్యవసాయ బావి వద్ద కాడెద్దులను వేర్వేరుగా కట్టేసి ఇంటికి వచ్చాడు. మంగళవారం వర్షం పడటంతో పాటు పిడుగు పడడంతో కాడెద్దు మృతి చెందింది.

ఇండ్ల సమీపంలో పిడుగు

కొండపాక(కుకునూరుపల్లి), జూన్ 11 : కొండపాక మండలంలోని దుద్దెడ గ్రామ శివారులోని తుర్కకాశే ఇండ్ల సమీపంలోని మామిడి చెట్టుపై మంగళవారం సాయంత్రం పిడుగు పడింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

12 గొర్రెలు మృతి

దుబ్బాక,జూన్11: దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిన్ననిజాంపేటలో పిడుగుపాటుకు 12 గొర్రెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు చిన్ననిజాంపేట గ్రామానికి చెందిన కొనపురం పెంటయ్య రోజు మాదిరిగానే గ్రామ శివారులో గొర్రెల మందను మేపడానికి తీసుకువెళ్లాడు. మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఒక్కసారిగా పెద్ద శబ్దంతో గొర్రెల మందపై పిడుగుపడటంతో 12 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ప్రభుత్వం ఆదుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ శేర్ల కైలాస్ కోరారు.

మల్యాలలో.. ఆవు మృతి

నారాయణరావుపేట, జూన్ 11 : మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన బండారి కనకయ్యకు చెందిన పాడి ఆవు పిడుగు పడి మృతి చెందింది. ఈ మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అఖిలేశ్, వైద్యుడు అభిలాష పంచనామా నిర్వహించారు.

పిడుగు పడి వ్యక్తి మృతి

తొగుట, జూన్ 11 : పిడుగు పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన తొగుట మండలం జప్తిలింగారెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కడారి శ్రీశైలం (44) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం పొలం వద్ద పనులు చేస్తున్న క్రమంలో పిడుగు పడడంతో సృహ కోల్పోయాడు. ఇది గమనించిన చుట్టు పక్కల గల రైతులు ప్రాణాపాయస్థితిలో ఉన్న అతడిని వెంటనే సిద్దిపేట ఏరియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

బంగారం కోసం మహిళ పై దాడి

ములుగు, జూన్ 11 : గుర్తు తెలియని దుండగులు మహిళపై సుత్తెతో దాడిచేసి బంగారాన్ని అపహరించిన ఘటన మండల పరిధిలోని వంటిమామిడిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... మండల పరిధిలోని తునికిబొల్లరంకు చెందిన శంకర్మ(48) కూరగాయలను విక్రయించేందుకు మంగళవారం వంటిమామిడిలోని కూరగాయల మార్కెట్ వద్దకు వెళ్లింది. అదే సమయంలో గుర్తు తెలియని దుండగులు ఆమెపై సుత్తెతో దాడి చేసి ఒంటి పై ఉన్న బంగారాన్ని అపహరించారు. కాగా స్థానికులు 108 సిబ్బందికి సమాచారం అందించడంతో ఆమెను ఆర్వీఎం దవాఖానలో చేర్పించారు.

సేంద్రియ పద్ధతిలో అధిక దిగుబడి

రామాయంపేట వీడియో కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్

రామాయంపేట, జూన్ 11 : రైతులు సేంద్రియ పద్ధతుల ద్వారా పత్తి పంటలో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందు పేర్కొన్నారు. మంగళవారం రామాయంపేట రైతువేదికలో రైతు నేస్తం ప్రోగ్రాంలో రైతులకు వీడియో కాన్ఫరెన్సు ద్వారా శాస్త్రవేత్తలతో అవగాహన నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్సు కార్యక్రమానికి హాజరైన జిల్లా అధికారి రైతులకు పలు సూచనలు సలహాలిచ్చారు. ప్రతి రైతు తమ వ్యవసాయ పంటలకు సేంద్రియ పద్ధతుల ద్వారా పండించుకోవాలన్నారు. సేంద్రియ పద్ధతులను అలవర్చు కుంటే రైతుకు పంటల దిగుబడి అధికంగా ఉంటుందన్నారు. సేంద్రియంతో ఖర్చు తక్కువ దిగుబడి ఎక్కువగా వస్తుందన్నారు. పంటల చీడపీడల నివారణకు సేంద్రియ ఎరువులు ఎంతో పనిచేస్తాయన్నారు. ప్రతి మంగళవారం జరిగే రైతు నేస్తం కార్యక్రమానికి మండలంలో ఉన్న రైతులందరూ విధిగా హాజరై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్య క్రమంలో రామాయంపేట వ్యవసాయ శాఖ డివిజన్ సహాయ సంచాలకులు వసంత సుగుణ, ఏవో. రాజ్‌నారాయణ, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందిస్తాం..

మెదక్ ఆర్డీవో రమాదేవి

రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో రమాదేవి

రామాయంపేట, జూన్ 11 : మెదక్, ఎల్కతుర్తి రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న వారికి ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందని మెదక్ ఆర్డీవో రమాదేవి పేర్కొన్నారు. మంగళవారం రామాయంపేట తహసీల్దార్ కార్యాలయంలో భూబాధితులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు సలహాలిచ్చారు. రోడ్డులో భూములు కోల్పోతున్న వారు సంయమనం పాటించాలని ప్రభుత్వం కచ్చితంగా పరిహారం అందజేస్తుందన్నారు. రోడ్డు విస్తరణ పనులకు మెదక్, రామాయంపేట, సిద్దిపేట రోడ్డులో ఉన్న రైతులు, వ్యాపారులు సహకరించాలన్నారు.

తమ భూములు ఇవ్వమంటూ భూ బాధితుల ఆందోళన

రోడ్డు విస్తరణలో తమ విలువైన భూములను ఇచ్చేది లేదంటూ ఆర్డీవో రమాదేవికి సభలో భూబాధితులు తేల్చి చెప్పారు.గతేడాది కాలంగా తమ భూములను ఇవ్వమంటూ చెప్పుకుంటు వస్తున్నామని ఎట్టి పరిస్థితులోనూ తమ భూములను ఇవ్వమన్నారు. తమకు ఉన్నదే కొద్ది భూమి ఆ భూమిలో తాము ఇళ్లు కట్టుకుంటామని తమకు ఆ భూమి తప్ప మరెక్కడా లేదన్నారు. విలువైన భూములను తాము ఇవ్వమని ఆర్డీవో ఎదుటే రైతులు బీష్మించుకు కూర్చున్నారు. తాము ఎప్పటి నుంచో భూముల్లో ఇండ్లు కట్టుకుందామని ఆశతో ఉన్నామని ప్రభుత్వం రోడ్డు విస్తరణ పేరిట భూములను లాక్కోవడం సరికాదన్నారు. అధికారులకు రోడ్డు వేయాలనుకుంటే రామాయంపేట పట్టణంలో నుంచి రోడ్డు వేయాలన్నారు. బైపాస్ పేరిట రోడ్డు వేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో రామాయంపేట తహసీల్దార్ రజినీ కుమారి, ఆర్ఐ.రాజు, వ్యాపారులు, రైతులు ఉన్నారు.

మహిళా సంఘాలకు అవగాహన

అవగాహన కల్పిస్తున్న డీసీసీబీ మేనేజర్

రామాయంపేట, జూన్ 11 : మహిళా సంఘాలు డీసీసీబీ బ్యాంక్‌లో డిపాజిట్‌ల పథకాలు ప్రారంభించామని ప్రతి ఒక్కరూ డీసీసీబీలోనే తమ డబ్బులను డిపాజిట్లు చేసుకోవాలని రామాయంపేట బ్యాంకు మేనేజర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం రామాయంపేట మండలం ఆర్. వెంకటాపూర్, డి.ధర్మారం గ్రామాల్లో పర్యటించి డ్వాక్రా, మహిళా సంఘాలకు నూతన డిపాజిట్లపై అవగాహన కల్పించారు. మండలంలోని వ్యవసాయ రైతులు, యువజన సంఘాలు, వ్యాపారస్తులు ప్రతి ఒక్కరూ డీసీసీబీలోనే తమ డిపాజిట్‌లను చేసుకోవాలన్నారు. అసిస్టెంటు మేనేజర్ మిట్టపల్లి రాజు, అక్షరాస్యత కౌన్సిలర్ మహేందర్, సీఈవో పుట్టి నర్సింహులు తదితరులు ఉన్నారు.

అక్రమంగా డంప్ చేసిన ఇసుక సీజ్

మిరుదొడ్డి, జూన్ 11 : అక్రమంగా డంప్ చేసిన ఇసుకను సీజ్ చేసి కేసు నమోదు చేసిన సంఘటన మిరుదొడ్డిలో చోటు చేసుకుంది. మిరుదొడ్డి ఎస్సై పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం.. మిరుదొడ్డి శివారులోని చంద్రశేఖర్ ఫ్లోర్ మిల్ వద్ద అనుమతులు తీసుకోకుండా 20 టన్నుల ఇసుకను మొగ్గు మల్లేశం అనే వ్యక్తి డంప్ చేశాడు. సమాచారం మేరకు దాడి చేసి, ఇసుకను సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అయ్యప్ప దేవాలయంలో హోమం

అయ్యప్ప దేవాలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 11 : జిల్లా కేంద్రంలోని అయ్యప్ప దేవాలయ 23 వార్షికోత్సవం పురస్కరించుకొని మంగళవారం తెల్లవారు జామున 5 గంటలకు స్వామికి సుప్రభాతసేవ, మహాభిషేకం, నిత్యపూజ, హారతి ఉదయం 8.35 గంటలకు స్వస్తివాచనం, ఆఖండ దీపారాధన, నవగ్రహ పుష్పార్చన, గణపతి హవనం, పూర్ణహుతి తదితర పూజ కార్యక్రమాలు వేదమంత్రోచ్చరణలతో నిర్వహించారు. అనంతరం హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు లక్ష్మీపతి, కొండ శ్రీనివాస్ తదితర భక్తులు పాల్గొన్నారు.

ఆరుబయటే ఆరోగ్య సేవలు

పల్లెదవాఖానకు తాళం వేయడంతో రోగులతో పాటు ఆరుబయటే ఉన్న ఆశవర్కర్లు

నిజాంపేట, జూన్ 11 : మండల కేంద్రం నిజాంపేటలో మంగళవారం ఆశవర్కర్లు రోగులకు అందించే ఆరోగ్య సేవలు పల్లె దవాఖాన ఆరుబయటే అందించారు. గ్రామంలో పల్లెదవాఖాన గత కొన్ని రోజుల నుంచి ఓ ఇంటి యజమాని గదిలో కొనసాగుతున్నది. ఆరు నెలల నుంచి అద్దె సిబ్బంది చెల్లించక పోవడంతో మంగళవారం సదరు ఇంటి యజమాని పల్లెదవాఖానకు తాళం వేశాడు. చేసేది ఏమిలేక వైద్య సిబ్బంది బీపీ,షుగర్ వంటి వైద్య పరీక్షలు ఆరుబయట చేశారు. ఇదిలా ఉండగా నిజాంపేటలో నిర్మాణం పూర్తైన పల్లెదవాఖాన అందుబాటులోకి వస్తే ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని ఆశ వర్కర్లు తెలిపారు.

విద్యావలంటీర్లను రెన్యూవల్ చేయాలి

విద్యావలంటీర్లను రెన్యూవల్ చేయాలని అసంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ మంగళవారం కలెక్టర్ రాహుల్‌రాజ్, మెదక్ విద్యాశాఖ కార్యాలయ ఏడీ విజయకు వినతి పత్రం అందజేశారు.

-చేగుంట, జూన్ 11

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 11 : షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గుల్షన్‌క్లబ్‌లో మంగళవారం జిల్లాస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు వంద మంది పాల్గొన్నారని కరాటే మాస్టర్ దినాకర్ తెలిపారు. పోటీల్లో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని, విద్యార్థులకు షోటోకాన్ స్పోర్ట్ కరాటే ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు నగేశ్ బెల్టులతో పాటు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో కరాటే మాస్టార్లు విద్యసాగర్, నితన్యసిరి, అబ్దుల్లా, విశిష్టరాజ్, స్వరూప్, మణివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా వార్షికోత్సవం

హాజరైన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

రేణుకా ఎల్లమ్మ దేవి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, జూన్ 11 : నర్సాపూర్ పట్టణంలోని సంగారెడ్డి మార్గంలో గల రేణుకా ఎల్లమ్మదేవి 13వ వార్షికోత్సవం మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యింది. ఈ వార్షికోత్సవంలో భాగంగా మొదటి రోజున జమదగ్ని రేణుకా దేవి కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే సునీతాల క్ష్మారెడ్డిని ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ వర్షాలు సకాలంలో కురిసి రైతన్నలు సుఖసంతోషాలతో విరజిల్లాలని అమ్మవారిని వేడుకున్నామన్నారు. ఈ వేడుకలకు పట్టణంలోని ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్యంగౌడ్, బీఆర్ఎస్ నాయకులు సూరారం నర్సింహులు, బాలరాజు, జ్ఞానేశ్వర్‌గుప్తా, శ్రావణ్, రింగుల ప్రసాద్, గౌడ సంఘ సభ్యులు లక్ష్మీనారాయణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, శ్యాంసుదర్‌గౌడ్, కృష్ణగౌడ్, రామకృష్ణగౌడ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నార్మల్ డెలివరీలకే అధిక పాధాన్యం

జిల్లా వైద్యాధికారి శ్రీరామ్

రికార్డులను పరిశీలించి మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి శ్రీరామ్

రామాయంపేట, జూన్ 11 : ప్రభుత్వ దవాఖానలో నార్మల్ డెలివరీల శాతాన్ని పెంచాలని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ పేర్కొన్నారు. మంగళవారం రామాయంపేటకు ఆకస్మికంగా విచ్చేసిన వైద్యాధికారి రామాయంపేట, సీహెచ్‌సీ, డి.ధర్మారం పీహెచ్‌సీలలో రికార్డులను పరిశీలించి వైద్యులకు పలు సూచనలు సలహాలిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ దవాఖానల్లో నార్మల్ డెలివరీలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ దవాఖానల్లోనే ప్రసవాలు అనుకున్నదాని కంటే ఎక్కువ స్థాయిలో చేస్తున్నామన్నారు. వైద్యులు దవాఖానలలో ఓపీ శాతాన్ని కూడా మరింత పెంచాలన్నారు. కిందిస్థాయి సిబ్బంది ప్రతి రోజు తమకు అప్పగించిన గ్రామాలకు వెళ్లి గర్భిణుల సర్వేలను చేయాలన్నారు. ప్రతి గ్రామంలో ఎంతమంది గర్భిణులు ఉన్నారో రోజురోజుకు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఏ ఒక్కరూ కూడా గ్రామాలకు వెళ్లకుంటే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వైద్యాధికారి వెంట డిప్యూటీ డీఎం హెచ్‌వో అనిల, విజయ నిర్మల, శివపడయాల్, నవీన్, లింబాద్రి, హరిప్రియ, ప్రదీప్, మనికంఠ, నర్సులు జయలక్ష్మి తదితరులు ఉన్నారు.

రూ. 7.35 లక్షలు పలికిన వెల్దుర్తి తైబజార్

వెల్దుర్తి, జూన్ 11 : మండల కేంద్రమైన వెల్దుర్తి పంచాయతీ తైబజార్ వేలం పాట రూ. 7.35 లక్షలు పలికింది. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి బలరాంరెడ్డి తైబజార్ వేలంపాటను నిర్వహించగా,